నవతెలంగాణ
www.navatelangana.com
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
శనివారం 15 జులై 2023

కలెక్టరేట్ ఎదుట డీఎస్సీ అభ్యర్థుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తూ టెట్‌తో పాటు డిఎస్సి (టిఆర్టీ) నోటిఫికేషన్ తొందరగా విడుదల చేయాలని టిఆర్టీ, డీఎస్సీ సాధన అభ్యర్థులు కోరారు. ఈ విషయమై శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను ఉమ్మడి జిల్లా డిఎస్సి అభ్యర్థులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు డిఎడ్, బిఎడ్ అభ్యర్థులు మాట్లాడుతూ టిఆర్టి నోటిఫికేషన్ త్వరగా జారీ చేయాలన్నారు. ఈ విషయం గురించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు.



వ్యాపార సముదాయ భవన నిర్మాణానికి మంత్రి శంఖుస్థాపన

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నూతన నిర్మించనున్న వ్యాపార సముదాయ భవన నిర్మాణానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శుక్రవారం శంఖుస్థాపన చేశారు. రూ.60లక్షల నిధులతో అన్ని హంగుల్లో నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం, జోగు రామన్న దిష్టి బొమ్మలకు ఉరి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని నేతాజీ చౌక్ వద్ద సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్నల దిష్టిబొమ్మలకు ఉరి తీశారు. అనంతరం దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంజీవరెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం బీఆర్‌ఎస్ నిరసనలో బీఆర్‌ఎస్ గుండాలు తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఉరి తీస్తే గంటల పాటు అలాగే ఉన్న పోలీసులు పట్టించుకోలేదన్నారు. వేసిన ఉరిని తీసేయమని వెళ్లి తమ నాయకులు అడుగుతే అక్రమంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారన్నారు. దీనికి నిరసనగా ఎమ్మెల్యే, సీఎం దిష్టిబొమ్మలను దహనం చేసినట్టు తెలిపారు. రైతుల విషయంలో ఏదైతే రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ గుండాలు వక్రీకరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతుల ప్రభుత్వం, రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అంటూ.ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం అందిస్తున్న ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనంలో ఎంపీపీ మల్లికార్జున్, పిఎసిఎస్ చైర్మన్ అలిబిన్ అహ్మద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులను అభివృద్ధి పరచడానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్, సింగిల్విండో వైస్ చైర్మన్ ప్రహ్లాద్, వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు శ్రీనివాస్, భీమేష్, రైతులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత



నవతెలంగాణ - రెబ్బెన

గోలేటిలో జీఎం కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియా జీఎం జి దేవేందర్ ఆరుగురు వారసులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం దొరకడం అదృష్టమన్నారు. గైర్హాజరు కాకుండా నిత్యం నిబద్ధతతో పనిచేయాలన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండి కుటుంబం, సింగరేణి సంస్థ ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. అధికారుల సూచనలు, ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించి ఉత్తమ ఉద్యోగులుగా పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం తిరుమలరావు, పీఓ ఎస్ సత్యనారాయణ, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహెర, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, టీబీజీకేయస్ ఫిట్ కార్యదర్శి గడ్డం రవీందర్, బీపీఓసీటు మేనేజర్ మహేష్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

నవతెలంగాణ-హాజీపూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మంచిర్యాలలోని రంగంపేట మాస్టర్ బ్యాడ్మింటన్ అకాడమీలో నాలుగు రోజులపాటు కొనసాగిన అండర్-19 రాష్ట్రస్థాయి బాల, బాలికల మిక్స్ డబుల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫైనల్ పోటీలకు ప్రభుత్వ విప్ చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్యే దివాకర్ రావు హాజరయ్యారు. అడిషనల్ కలెక్టర్ రాహుల్, డీసీపీ సుధీర్ రామ్నాథ్ కేకన్, పెద్దపల్లి ఏసీపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎడ్ల మహేష్, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డిలతో కలిసి క్రీడాకాలను పరిచయం చేసుకొని మిక్సీ డబుల్స్ పోటీలను ప్రారంభించారు. అంతకు ముందు జరిగిన ఫైనల్ పోటీలలో గెలుపొందిన వారికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్, అదనపు కలెక్టర్ రాహుల్, సుధీర్ రామ్నాథ్, ఏసీపీ ఎడ్ల మహేష్‌లతో కలిసి బ్యాడ్మింటన్ ఆడి అందర్నీ ఉత్తేజపరిచారు. విద్యార్థులు యువతీ యువకులు అందరూ క్రీడలలో రాణించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎప్పుడు క్రీడలను క్రీడకాలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో మంచిర్యాలలో మరిన్ని రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించాలని అసోసియేషన్‌ను కోరారు. అనంతర ఎమ్మెల్యే గెలుపొందిన క్రీడా కారులకు బహుమతులు అందజేశారు.

నులిపురుగుల నిర్మూలన దినోత్సవం విజవంతం చేయాలి

ఆసిఫాబాద్: జిల్లాలోఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ సహదేవరావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1 నుండి 19 సంవత్సరాల లోపు గల వారికి ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలను నులిపురుగుల నివారణకై అందించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు మాత్రలు అందించాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రామకృష్ణ, జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి పాల్గొన్నారు.

వంటకు తంటా..!

- సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు
- ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్న విద్యార్థులు
- కొన్ని చోట్ల ఉపాధ్యాయులే వండుతున్న వైనం
- 26వరకు కొనసాగించాలని కార్మికుల నిర్ణయం

సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు చేపడుతున్న సమ్మె విద్యార్థులకు అవస్థలు తెచ్చిపెడుతోంది. భోజనం వండకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజన నిర్వాహకులు సమ్మెలో ఉండటంతో విద్యార్థులకు భోజనం కష్టతరంగా మారుతోంది. కార్మికులు వంట చేయకపోవడంతో అనేక పాఠశాలల్లో భోజనం బంద్ కాగా.. కొన్ని చోట్ల ఉపాధ్యాయులే వంట చేసి విద్యార్థులకు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నెలల కొద్దీ బిల్లులు చెల్లించకపోవడం.. పెంచిన వేతనం అమలు చేయకపోవడం వంటి కారణాలతో నిర్వాహకులు అసంతృప్తికి గురవుతున్నారు. ఇది వరకే పలుమార్లు నిరసనలు తెలిపినప్పటికీ ప్రభుత్వం పరిష్కారం దిశగా దృష్టిసారించలేదు. ఫలితంగా సమ్మె చేపడితేనే ప్రభుత్వం దిగొస్తుందనే ఉద్దేశంతో కార్మికులు నిరసన బాట పట్టారు. ప్రభుత్వ అలసత్వం కారణంగా సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఇంటి నుండి భోజనం తెచ్చుకొని తింటున్న విద్యార్థులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతోంది. ఇందుకు ప్రత్యేకంగా వంట కార్మికులను నియమించింది. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.5చొప్పున, ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.8చొప్పున అందజేస్తోంది. కార్మికులే సొంత డబ్బులు వెచ్చించి వంట సామగ్రి కొనుగోలు చేసి విద్యార్థులకు వండి పెడుతున్నారు. ప్రస్తుతం నిత్యావసర సరకుల ధరలు పెరగడం..ప్రభుత్వం చెల్లిస్తున్న డబ్బులు అతి తక్కువగా ఉండటంతో కార్మికులకు ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదు. మరోపక్క కార్మికులకు రూ.3వేల గౌరవ వేతనం అందజేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ హామీ ఇప్పటికీ నెరవేరడం లేదు. మధ్యాహ్న భోజనం వండిపెట్టడం భారంగా మారడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు తీసుకొచ్చి విద్యార్థులకు వండిపెట్టాల్సి వస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల బిల్లులతో పాటు పెంచిన వేతనం అందజేయాలని, కోడిగుడ్ల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కనీస వేతనం రూ.26వేలు అందించాలని, గుర్తింపు కార్డులు అందజేయాలని, నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వరాదని స్పష్టం చేస్తున్నారు.

ఇంటి నుంచి భోజనం..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 3371 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటి పరిధిలో 4.50లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 1140 పాఠశాలలున్నాయి. వీటి పరిధిలో 6500మంది మధ్యాహ్న భోజన కార్మికులు విద్యార్థులు రోజూ వండిపెడుతున్నారు. ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రతి విద్యార్థికి రూ.26చెల్లించాలని, రోజుకు రూ.600చొప్పున అందించాలని, వంటసామగ్రి, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క ఆయా పాఠశాలల్లో భోజనం నిలిచిపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే స్వయంగా విద్యార్థులకు వండిపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమ్మెను ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగించాలని కార్మికులు నిర్ణయించారు. అప్పటిలోగా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలి : లక్ష్మీ మధ్యాహ్న భోజన కార్మికురాలు



సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపడుతున్నాం. అనేక నెలలుగా పెండింగ్‌లు ఉన్నాయి. ప్రభుత్వం వేతనం పెంచుతామని హామీనిచ్చినా అమలు చేయలేదు. బిల్లులు రాకపోవడంతో అప్పులు తీసుకొచ్చి వంట చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలన్నింటిని పరిష్కరించాలి. డిమాండ్లన్నింటిని నెరవేర్చాలి.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడొద్దు



నవతెలంగాణ-కెరమెరి

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సతీష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిల్వ ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పాఠశాలలో వారం రోజులుగా విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నారని, ప్రధానోపాధ్యాయులకు విద్యార్థులు పలు మార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. గురువారం పురుగులతో కూడిన అన్నం తినలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందికి గురయ్యారన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందని, దీంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో గత సంవత్సరంలో దాదాపుగా 8మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అయినా విద్యార్థుల సమస్యలు అధికారులకు పట్టించుకోకపోగా, అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలన్నర గడుస్తున్నా నేటికీ విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు అందని దుస్థితి నెలకొందన్నారు. జిల్లాలోని పలు పాఠశాలలలో టాయిలెట్స్‌లు, సరిపడా ఉపాధ్యాయులు లేరని పేర్కొన్నారు. వసతి గృహాలలో అనేక సమస్యలున్నాయని, బిల్డింగ్‌లో పెచ్చులు ఊడుతున్నాయన్నారు. మెనూ ప్రకారం ఆహారం పెట్టడం లేదని, అధికారులు వెంటనే జిల్లాలోని విద్యారంగం, వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడే భీమేశ్, ఉపాధ్యక్షులు జాఫర్, కమిటీ సభ్యులు నితీష్, రాంచందర్, నాయకులు నాందేవ్, గణేష్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి : ఎమ్మెల్యే

- మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా అందించే వృత్తి నైపుణ్య శిక్షణలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక ప్రగతి సాధించాలని ఎమ్మెల్యే జోగు రామన్న సూచించారు. పట్టణంలోని భాగ్యనగర్‌లో గల న్యాక్ కేంద్రంలో శుక్రవారం మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ న్యాక్ ద్వారా 16 రకాల వృత్తి నైపుణ్య శిక్షణలు అందిస్తున్నారని తెలిపారు. కుట్టు మిషన్ వంటి శిక్షణలే కాకుండా సాంకేతికంగా సైతం రాణించాలన్నారు. స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోడానికి ఇటువంటి శిక్షణలు ఎంతగానో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ సైతం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండడానికి ఆసక్తి కలిగిన అంశాల్లో శిక్షణ పొందాలన్నారు.



కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్ అశోక్ స్వామి, మిషు, సంజయ్, న్యాక్ నిర్వాహకులు మేరీ, ద్యావంత్ రమేష్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు అందించాలని ధర్నా



నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణి కాంట్రాక్టు కార్మికులు కనీస వేతనాల జీవో 22ను గెజిట్ చేసి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.ఓదేలు మాట్లాడుతూ 9సంవత్సరాల నుండి సింగరేణిలో పనిచేస్తున్న 25వేల మంది కాంట్రాక్టు కార్మికులకు జీతాలు పెంచకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు. బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి సాధిస్తున్న లాభాల్లో, సంస్థ అభివృద్ధిలో కాంట్రాక్టు కార్మికుల శ్రమ ఉందన్నారు. సుప్రీంకోర్టు ప్రకటించిన కనీస వేతనం రూ.26 వేలు, కోలిండియాలో చెల్లిస్తున్న రూ.27వేలు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2021 జూన్ 30న ప్రకటించిన రూ.26వేలల్లో దేనికి నోచుకోకుండా సింగరేణి కాంట్రాక్టు కార్మికులు కేవలం రూ.12,844 జీతం తీసుకుంటున్నారని తెలిపారు. జీతంలో కట్ చేసిన వివరాలు తెలుసుకుందామన్నా స్లిప్పులు కూడా ఇవ్వడం లేదన్నారు. నర్సరీ కార్మికులకు సీఎంపీఎఫ్ అమలు కావడం లేదని, అగ్రికల్చర్ జీవో ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని, సీఎంపీఎఫ్ కట్ చేసిన చిట్టీల వివరాలు కూడా 2019 నుండి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఒప్పందం అంశాలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మళ్లీ సమ్మె చేసే పరిస్థితి కల్పించవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిద్దెంకి సత్తయ్య, మండల నాయకులు చిన్నుబాయి, శారద, అనిత, ప్రవీన్, ధర్మారావు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ దాబాను ప్రారంభించిన మంత్రి

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని నటరాజ్‌నగర్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన నవీన్ సంతోష్ ఫ్యామిలీ దాబాను శుక్రవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాబా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపిపి రామేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ మహమ్మద్ రఫీ, జ్ఞానేశ్వం గోస్వామి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



నవతెలంగాణ-సారంగాపూర్

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ధని గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆరోగ్య సిబ్బంది గ్రామ ప్రముఖులతో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి సీజనల్ వ్యాధులు రాకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటిలోని చెత్త విధుల్లో వేయకుండా, నీరు నిల్వలేకుండా స్వచ్ఛభారత్ ట్రాక్టర్‌లోనే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడెల్లి ఆలయ ఛైర్మెన్ అయిటి చందు, గ్రామ సర్పంచ్ లక్ష్మీ, ఎంపీటీసీ శ్రీనివాస్ యాదవ్, ఎంపీడీవో సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సలోమి కరుణ, హెల్త్ సూపర్వైజర్ కెఎం గౌడ్, ఈజీఎస్ ఎపిఓ లక్ష్మారెడ్డి, ఎఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్స్



నవతెలంగాణ - సిర్పూర్(టీ)

సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న జిల్లాలోని ఐదు బాలుర, బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో మిగిలిన ఖాళీలను భర్తీ చేసినట్టు డీసీఓ పోలోజు బాలరాజు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఐదు గురుకుల కళాశాలలో జరిగిన స్పాట్ అడ్మిషన్‌లో వివిధ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న 65 సీట్లు భర్తీ అయ్యాయని, సిర్పూర్ గురుకుల బాలుర, బాలికల కళాశాలలో సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఎస్సీ విద్యార్థులకు మాత్రమే సుమారు 35 సీట్లు మిగిలున్నాయని, ఆ సీట్లను కూడా పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి భర్తీ చేస్తామన్నారు. స్పాట్ అడ్మిషన్‌లో ప్రిన్సిపల్ శ్రీనాథ్, సంధ్యారాణి, జ్యోతి, సంగీత, ఉపాధ్యాయులు ఫ్రాన్సిస్, రాజ్‌కుమార్, సుధాకర్, శంకర్, రహీం, ఉషారాణి పాల్గొన్నారు.

షాదీఖానా భవనానికి ఎమ్మెల్యే శంఖుస్థాపన



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు ఫ్లడ్ కాలనీలో మైనారిటీ సంక్షేమ శాఖ గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధుల నుండి రూ.57.50లక్షలతో మంజూరైన ఉర్దూఘర్ అండ్ షాదీఖానా భవనానికి శుక్రవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమానికి ఎల్లవేళలా సాయపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్ జబీనా బేగం, పట్టణ అధ్యక్షులు అక్కూరి సుబ్బయ్య పట్టణ కార్యదర్శి మెరుగు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

బోథ్‌లో చంద్రయాన్-3 విజయోత్సవం

నవతెలంగాణ-బోథ్

పట్టణంలోని స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో చంద్రయాన్-3 విజయోత్సవాన్ని సామాజిక సేవకుడు ఇర్షద్‌అలీ అధ్వర్యంలో నిర్వహించారు. ఇస్రో ప్రతిష్టాత్మకంగా నింగిలోకి చంద్రయాన్-3ని ప్రయోగించిన శుభ సందర్భంలో యావత్ భారతీయులకు శుభాభివందనాలు తెలిపారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచారు. ఈ విజయం యావత్ 130 కోట్ల భారతీయులు ఆకాంక్ష అని మీర్ ఇర్షద్ అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-జైనూర్

మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ సాదిక్‌పాషా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో సరఫరా అయ్యే 132 కేవీ ఉట్నూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల వల్ల ఉదయం నుండి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చంద్రయాన్-3 ప్రయోగాన్ని తిలకించిన విద్యార్థులు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని కల్వతండా గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా శ్రీహరికోట నుంచి నిర్వహించిన చంద్రయాన్-3 ప్రయోగాన్ని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో వీక్షించారు. ఈ రాకెట్ ప్రయోగ సమయంలో విద్యార్థులు ఆనందోత్సాహాలతో చప్పట్లు కొట్టారు. రాకెట్ ప్రయోగం వివరాలు ఉపయోగాలను పాఠశాల ఉపాధ్యాయులు జిట్టి.రమేష్, తిరుపతి వివరించారు. అందరూ సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఐటీ సోషల్ మీడియా కన్వినర్ రాథోడ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్ డీఎస్పీగా ఎల్.గంగారెడ్డి బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-నిర్మల్



నిర్మల్ డీఎస్పీగా ఎల్.గంగారెడ్డి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎల్.జీవన్‌రెడ్డి హుజురాబాద్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ చల్లా ప్రవీణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.

ఘనంగా డాక్టర్ రవికిరణ్ యాదవ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-తలమడుగు

డాక్టర్ రవికిరణ్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని పాఠశాల విద్యార్థులతో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నారాయణ మాట్లాడుతూ సాయి వైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. విద్యార్థులతో కలిసి ట్రస్ట్ సభ్యులు కేక్ కట్ చేశారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. జన్మదిన సందర్భంగా నోటు బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఎంఈఓ ట్రస్ట్ సభ్యులతో కలిసి విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. డాక్టర్ రవి కిరణ్ జిల్లాలో మరిన్ని సేవలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ చంటి, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ పద్మాకర్ రెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వినోద్‌రెడ్డి, వెంకట్‌రమణ, సాయి వైకుంఠ ట్రస్ట్ సభ్యులు జంగా ఆశన్న యాదవ్, మట్ట శ్రీనివాస్ యాదవ్, నర్రా నవీన్ యాదవ్, కాడిగిరి రామన్న యాదవ్, మేకల రవికాంత్ యాదవ్, జక్కుల రవీందర్ యాదవ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతును రారాజు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి) గ్రామంలోని కొత్తగా పట్టా పాస్‌బుక్‌లు వచ్చిన 35మంది లబ్దిదారుల నుండి రైతు జీవిత బీమా పత్రాలను శుక్రవారం వ్యవసాయ విస్తీరణ అధికారి సాయినాథ్, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్‌లు స్వీకరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్లాడుతూ రైతును రాజు చేయటానికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారు. దీంతో రైతులకు రైతుబంధు, రైతు జీవిత బీమా, నాణ్యమైన ఉచిత కరెంటు ఇవ్వడం జరగుతుందని అన్నారు. గత రెండు రోజుల క్రితం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటలు మాత్రమే కరెంట్ సరిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తుకారాం, ఏఈఓ సాయినాథ్, గ్రామ రైతు అధ్యక్షుడు సురేష్, మార్కెట్ డైరెక్టర్ యాకినోద్దిన్, వార్డు సభ్యులు మీలింద్, వడ్ల లక్ష్మణ్, గణేశ్, నారాయణ, శంకర్, రావుల శంకర్, శేర్లపెల్లి గణేశ్, సర్పె బీంరావు, మోహన్, దావుల సంతోష్, ఆవుల గజెందర్, కిశోర్, సాయిలు, గుమ్ముల నాగేష్, అన్నెవార్ గజేందర్, గుడాల శ్రీను పాల్గొన్నారు.

నల్లావారి సేవలు చిరస్మరణీయం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

నల్లావారి సేవలు చిరస్మరణీయమని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్యాల గ్రామంలో మాజీ సర్పంచ్ నల్లా భీమ్‌రెడ్డి, నల్లా రాంరెడ్డి విగ్రహాలను పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లావారి సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి నల్లా కుటుంబం చేసిన సేవలు గ్రామస్తులు, మండలవాసులు మర్చిపోలేరని మంత్రి కొనియాడారు. పేద ప్రజల పక్ష పాతిగా ఎన్నో సేవలు చేసి ప్రజల మనసులో చోటు దక్కించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్‌రెడ్డి, రాంకిషన్‌రెడ్డి, నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, నరేందర్‌రెడ్డి, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, సర్పంచ్ లలిత రాంరెడ్డి, లింగన్న, అల్లోల సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణపై ప్రచార వాహనాన్ని ప్రారంభించిన మంత్రి



నవతెలంగాణ-నిర్మల్

వరల్డ్ విజన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శాస్త్రినగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బాలల సంరక్షణపై ప్రచార వారోత్సవాల వాహనాన్ని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు. వారిని సంరక్షణ చేసే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ కె.రామేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ చైర్మెన్



ఆదిలాబాద్‌టౌన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులు దరిచేరవని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 19వ వార్డు పరిధిలోని గాంధీనగర్‌లో ఆయన విస్తృతంగా పర్యటించారు. సానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా వార్డులో తిరుగుతూ ప్రజలకు సూచనలు చేశారు. పారిశుధ్య పనులను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, కేంద్రంలో అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ప్రతి రోజు అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలపై ఆరా తీశారు. కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించి, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. అంతకుముందు వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా వ్యవహరించావాల్సిన అవసరం ఉందని అన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. వారంలో ఒకరోజు డ్రైడే పాటిస్తూ దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేయాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంగళ రామేశ్వర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్, నల్ల మహేందర్, వార్డు యూత్ అధ్యక్షుడు అజయ్, షేక్ అస్గర్ పాల్గొన్నారు.

ఖానాపూర్ రూరల్ :పట్టణంలోని గాంధీనగర్, శాంతినగర్, శ్రీరాంనగర్ కాలనీలో శుక్రవారం వైద్య సిబ్బంది డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ ధనరాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం, మంగళవారం, తప్పనిసరిగా గృహ సందర్శనకు వెళ్లాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అలాగే నివాస గృహాల్లో కూలర్లలో నిలువ నీరు లేకుండా చూడాలని అన్నారు. ఇంటి చుట్టూ ప్రక్కల నీటి డబ్బాలు కానీ చెడిపోయిన టైర్లు కానీ పాత కుండల్లో కానీ నిలువ నీరు లేకుండా చూసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సానిటేషన్ సక్రమంగా అమలు చేసే విధంగా ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్థానిక అధికారులకు ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ జయలలిత, విమల, వైద్య సిబ్బంది సంతోష్, రాజు, మధు, లావణ్య, రాజులతో పాటు మెప్మా సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో డ్రైడే...

పట్టణంలోని మున్సిపల్ అధికారులు సిబ్బందితో కలిసి డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ పాల్గొని మాట్లాడారు. డ్రైడేలో భాగంగా మున్సిపాలిటీ కార్యాలయంలో వేసవికాలంలో ఉపయోగించినటువంటి కూలర్లలోని నిలువ ఉన్న నీటిని తొలగించామని అన్నారు. ప్రజలు కూడా ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ బండారి కిషోర్‌తో పాటు మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఖానాపూర్ రూరల్

డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేర్చాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. శుక్రవారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ఆదిలాబాద్ విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. జీఓ నెంబర్ 8 ప్రకారం వేతనాలను ఏరియర్స్‌తో సహా చెల్లించాలని అన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని అన్నారు. కొత్త మెనూను సవరించి, అందుకు తగ్గట్టుగా బడ్జెట్ కేటాయించాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయపాత్ర వంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే ఆలోచనను వెంటనే విరమించుకోవాలన్నారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని అన్నారు. గుర్తింపు కార్డులను ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. అక్రమ తొలగింపులు అరికట్టాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యం కల్పించాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వాలన్నారు. ఇప్పటికే అప్పులు తీసుకొచ్చి విద్యార్థులకు వండి పెడుతున్నారని అన్నారు. దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారి వద్దకు డీఈఓ ప్రణీత వచ్చి వారి సమస్యను విన్నారు. అనంతరం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు ఉన్నారు.

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

నవతెలంగాణ-తాంసి



ఈ సారి అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వన్నెల అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. మొదటగా పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ జ్యోతిబాపులే విగ్రహాలను పూలమాలలు వేసి ప్రచారం ప్రారంభించారు. గ్రామంలోని కుటుంబాలను కలుసుకొని కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్‌ను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కేంద్రంలో వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలతో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో అధికారం చేపట్టి రైతులను నిరుద్యోగులను, విద్యార్థులను మోసం చేసిందని అన్నారు. రైతులకు 24 నాలుగు గంటల ఉచిత విద్యుత్ ఇందిరమ్మ ఇండ్లు ఆరోగ్యశ్రీ, రైతులకు రుణ మాఫీ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. ఇంటింటి ప్రచారంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడానికి అనుకూలంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ సంతోష్, నాయకులు రామన్న యాదవ్, గంగారెడ్డి, నారాయణ, రాజావలి, కిషన్, గంగారాం, హన్మండ్లు, అన్నూ పటేల్, రాంరెడ్డి, లక్ష్మిపతి, తాంసి, భీంపూర్, తలమడుగు, మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు నేడే చివరి రోజు : కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్హులైన ప్రతి ఒక్కరూ ఈనెల 15లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రత్యేక ఓటర్ల నమోదు అవగాహన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రంగోలి ముగ్గుల పోటీల కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ముందుగా విద్యార్థులు, మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి అభినందించారు. ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడానికి బైక్ ర్యాలీ, రంగోలి ముగ్గుల పోటీలు వంటి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అందులో భాగంగా నిర్వహించిన రంగోలి ముగ్గుల పోటీల్లో మహిళలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. శనివారం చివరి రోజు అయినందున అక్టోబర్ 1, 2023 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం-6 ద్వారా ఓటరు నమోదు చేసుకోవాలని, మరణించిన, వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లను తొలగింపుకు ఫారం-7, మార్పులు, చేర్పులకు ఫారం-8, ద్వారా సరిచేసుకోవచ్చని సూచించారు. ప్రతి ఒక్కరు వారి కుటుంబ సభ్యుల ఓటు హక్కు వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్ పోర్టల్‌లో ఎపిక్ నెంబర్‌తో వివరాలను పరిశీలించుకోవాలని అన్నారు. సాంకేతిక, ఇతర కారణాల వలన ఓటు హక్కు తొలగించబడినట్లైతే రేపటిలోగా ఫారం-6 పూరించి సంబంధిత పోలింగ్ కేంద్రంలోని బూత్ స్థాయి అధికారులకు, తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి, ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్‌ను రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రిని కలిసిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ రజనాల సంధ్యారాణి డాక్టర్ రవీంద్ర ప్రసాద్ ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే బోథ్ మండల కేంద్రంతో పాటు బజార్‌హత్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ, సిరికొండ, మండలాల కలుపుకొని బోథ్ మండల కేంద్రంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి హరీశ్‌రావు కార్యాలయంలో కలిసి విన్నవించారు. మండల కేంద్రంలోని ఆయా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. మండల కేంద్రంలోని జనరల్ డిగ్రీ కళాశాల, నూతన కోర్టు భవన నిర్మాణం, తహసీల్దార్ కార్యాలయం, నాలెడ్జి సెంటర్, మినీ స్టేడియం, ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి త్వరలోనే ఆయా శాఖల అధికారులకు ప్రతిపాదనలు పంపించి, సమస్యలను తీర్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీకి వినతి



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

గ్రామపంచాయతీల్లో సిబ్బంది స్వీపర్లు, పారిశుధ్య కార్మికులు, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, కారోబార్లు, బిల్‌కలెక్టర్లు వివిధ కేటగిరీలో పనిచేస్తున్న వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వానికి ఉత్తరం ద్వారా కృషి చేయాలని కోరుతూ శుక్రవారం ఎంపీపీ మోయిద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది మాట్లాడారు. గ్రామపంచాయతీ సిబ్బంది, దీనస్థితి చూడలేక వారి సమస్యలను న్యాయమైన సమస్యలుగా పరిగణిస్తూ గ్రామపంచాయతీ పాలకమండలులు సైతం తీర్మానాలు చేశాయని స్పష్టం చేశారు. తక్కువ వేతనం కారణంగా ఒకరి పేరుతో వచ్చే రూ.8వేల 500 ఇద్దరు లేదా ముగ్గురు సిబ్బంది తీసుకుంటున్నామని తెలిపారు. తమకు కనీస వేతనం, పీఎఫ్, ఆరోగ్యబీమా, గ్రాట్యూటీ, సెలవులు, గుర్తింపు కార్డుల సౌకర్యం కూడా లేదని వాపోయారు. కనీసం మృతి చెందిన సిబ్బందికైనా అంత్యక్రియల ఖర్చు కానీ, తక్షణ ఆర్థిక సాయం కూడా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎంపీపీ మోయిద్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాల్ సింగ్‌లతో పాటు మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న సిబ్బంది పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

మండలంలోని మస్కాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 11 మంది విద్యార్థిని, విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక వాసవి క్లబ్, వనిత క్లబ్ సభ్యులు శుక్రవారం శ్రీవాసవి మాత దేవాలయంలో విద్యార్థిని, విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలలోని 11 మంది విద్యార్థిని, విద్యార్థులు ఈ ఘనత సాధించడానికి కృషి చేసిన పాఠశాల సిబ్బందిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మెన్ మహాజన్ జితేందర్, వాసవి క్లబ్ అధ్యక్షులు ముక్క కిషన్, ప్రధాన కార్యదర్శి సామ లక్ష్మీనారాయణ, కోశాధికారి చిటికె సతీష్ కుమార్, వనిత క్లబ్ అధ్యక్షురాలు చిటికెశి మానస, ప్రధాన కార్యదర్శి చిటికేశి స్రవంతి, కోశాధికారి ఎలగందుల వరలక్ష్మిలతో పాటు మస్కాపూర్ విద్యా కమిటీ చైర్మెన్ పుప్పాల కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, లింగాపూర్ విద్యా కమిటీ చైర్మెన్ లక్కవత్తుల రాజనర్సింహ, సీనియర్ అసిస్టెంట్ నీలి, శ్రీలత, బోనగిరి నరేందర్‌లతో పాటు వాసవి క్లబ్, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో ఎమ్మెల్యే సతీమణి పూజలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే బోనాల పండుగ వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే జోగు రామన్న సతీమణి జోగు రమ పలు ఆలయాలను సందర్శించుకుని అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ముందుగా అశోక్ రోడ్‌లోని పోచమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకపూజలతో ఆరాధించి బోనం సమర్పించారు. అదేవిధంగా మహాలక్ష్మివాడలోని ఆలయంలో బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని కోరుకున్నారు.

బంగారుగూడ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాంగ్రెస్‌లో చేరిక



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారుగూడ కాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ మహబూబ్ అలీ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 9 ఏండ్లలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే జోగు రామన్న బంగారుగూడ కాలనీకి చేసింది ఏమి లేదని కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాడే సంతోష్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అఫ్రోజ్ పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
3
శనివారం 15 జులై 2023

కుమ్రం పద్మ గిరిజన విద్యార్థినులకు ఆదర్శం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్ఐటీ పంజాబ్‌లో సీటు సాధించిన జైనూర్ మండలం రాసిమెట్ట గ్రామానికి చెందిన కుమ్రం పద్మ గిరిజన విద్యార్థినులకు ఆదర్శంగా నిలిచిందని జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల ప్రాంతం నుంచి ఎన్ఐటీ సాధించడం సంతోషంగా ఉందన్నారు. అమ్మాయికి పూర్తిస్థాయిలో సహకరించిన తండ్రి కుమ్రం షెడ్మారావును అభినందించారు.

నిరుపేద విద్యార్థికి రూ.5000 ఆర్థిక సాయం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని పర్సనల్ విభాగా అధికారులు సింగరేణి ఉన్నత పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థికి రూ.5000ల నగదు ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం బి.సంజీవరెడ్డి విద్యార్థి తండ్రి కృష్ణయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ తమ కార్యాలయంలో పనిచేస్తున్న పర్సనల్ విభాగ అధికారులు సేవా దృక్పథంతో ఒక నిరుపేద విద్యార్థికి సాయం చేయడం చాలా సంతోషకరమైన విషయమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు మున్ముందు కూడా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, రాజేశ్వర్, డీవైపీఎంలు రాజేశ్వరరావు, రాజేష్, దేవేందర్‌రెడ్డి, సీనియర్ పీఓ కాంతారావు, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

వేతనాల జీఓను గెజిట్ చేయకపోతే మరో పోరాటం



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, జీఓ 22ను గెజిట్ చేయించాలని లేదంటే మరో పోరాటం తప్పదని ఎస్సీకేఎస్ బెల్లంపల్లి రీజినల్ కార్యదర్శి దూలం శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని సింగరేణి కాంట్రాక్టు కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో అతి పెద్ద రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిలో నేడు సుమారు 25వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, బొగ్గు ఉత్పత్తిలో, సింగరేణి సాధిస్తున్న లాభాలలో, సంస్థ అభివృద్ధిలో కాంట్రాక్టు కార్మికుల శ్రమ, కష్టం ఉందన్నారు. ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికులు లేకుంటే సింగరేణి ఒక్కరోజు కూడా నడవలేని పరిస్థితి ఉందని, సింగరేణిలో లాభాలకు మూలమైన కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెరుగుదల కోసం వివిధ రూపాలలో పోరాటాలు చేస్తూ, చివరకు 2022 సెప్టెంబర్‌లో 18 రోజుల సమ్మెచేస్తే, దిగివచ్చిన యాజమాన్యం లేబర్ అధికారుల సమక్షంలో 12 డిమాండ్లపై ఒప్పందం జరిగిందన్నారు. పూర్తిస్థాయిలో నేటి వరకు అగ్రిమెంట్‌ను అమలు చేయకుండా తాత్సారం చేస్తుందని, దీని మూలంగా కార్మికులు పొందవలసిన కనీస సౌకర్యాలు, చట్టబద్ధ హక్కులు, పని భద్రత, వైద్య సౌకర్యం వంటివి అమలులో నిర్లక్ష్యం జరుగుతుందని తెలిపారు. అలాగే 73 షెడ్యూల్ పరిశ్రమలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అనేక పోరాటాల ఫలితంగా ఐదు జీఓలను విడుదల చేసి, నేటికీ గెజిట్ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్, ఏరియా కార్యదర్శి కట్ల కళ, ఆర్కేపి ఏరియా కార్యదర్శి పెద్ద లచ్చన్న, అందాల సమ్మయ్య, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్పీఎం కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జీఓ 11ను సవరించి ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎస్పీఎంలో జీఓ.11 అమలు జరుగుతున్న అది కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. ఒక్కో విభాగం కార్మికులకు ఒక్కో విధంగా చెల్లిస్తున్నారన్నారు. కార్మికుల నైపుణ్యతను గుర్తించకుండా అందరినీ ఒకే విధంగా చూడడం సరైనది కాదన్నారు. జీఓ 11ను సవరించి జీఓ 22లో ఉన్న విధంగా వేతనాలు చెల్లించాలన్నారు. దాని ప్రకారం వేతనాలను అన్ స్కిల్డ్‌కు రూ.800, సేమిస్కిల్డ్‌కు రూ.960, స్కిల్డ్ కు రూ.1085, హైస్కిల్డ్ కు రూ.1226 నుండి రూ.1769లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రోజుకు రూ.178లను జాతీయ కనీస వేతనంగా ప్రకటించిందని అన్నారు. ఒక పక్క నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విపరీతంగా పెంచుతున్నాయని దానికనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి కార్మికుల వేతనాలు పెంచాలని లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జాదవ్ రాజేందర్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్ పాల్గొన్నారు.

రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ కిట్లు అందజేత



నవతెలంగాణ-నస్పూర్

రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నస్పూర్ పట్టణం తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి స్కూల్ కిట్లను (బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్) అందజేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడానికి తమ వంతు సహాయంగా విద్యార్థులకు 2014 నుండి ప్రతి ఏడాది స్కూల్ కిట్లు అందజేయడం జరుగుతుందని తెలిపారు. నస్పూర్ పట్టణం తీగల్ పహాడ్ పాఠశాలలో దాదాపు 100 మంది విద్యార్థులకు స్కూల్ కిట్లు అందించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తమ ఫౌండేషన్ తరపున విద్యతో పాటు క్రీడల్లో ప్రోత్సాహం అందిస్తామని అన్నారు. ఈ స్కూల్ కిట్లు పంపిణీ మంచిర్యాల నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈర్ల సదానందం, తిప్పని భీమయ్య కుర్రె చక్రి, సత్రమజ్ రమేష్, కొండ వెంకటేష్, రాజమల్లు, సతీష్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన



నవతెలంగాణ-దహెగాం

తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం పంచాయతీ కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు చంద రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుండా భిచ్చగాళ్లుగా మార్చుతుందని ఆవేధన వ్యక్తం చేశారు. మండలకేంద్రంలోని దుకాణ సముదాయాల్లో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వాంకిడి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె శుక్రవారం మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు సిడాం కట్టిగ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో చాలీచాలని వేతనాలతో పనులు నిర్వహిస్తున్నప్పటికీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. 9 రోజులుగా సమ్మెను కొనసాగిస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని, తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

చింతలమానపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మెలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు కార్మికులు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా ఐకేపీ ఫీల్డ్ అసిస్టెంట్ సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. సానుకూలంగా స్పందిస్తూ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రాష్ట్రం మొత్తం మీద సమస్య ఉన్నందుని త్వరలోనే సమస్య పరిష్కారమైతదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బులు నానయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డోకే రాజన్న తహసీల్దార్ ముస్కురాలి, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, నాయకులు చాపల సుధాకర్ నీల గౌడ్ పాల్గొన్నారు.

కెరమెరి : జీపీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడి భీమేష్, సీఐటీయూ కన్వీనర్ ఆనంద్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జీపీ కార్మికుల చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. నాటి నుండి గ్రామపంచాయతీ కార్మికులు 11వ పీఆర్సీని వర్తింపజేయాలని పోరాటాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సతీష్, ఉపాధ్యక్షుడు జఫ్పార్ గ్రామ పంచాయితీ కార్మికులు వెంకటేశం, నరేష్, సంతోష్, రాందాస్, నగేష్, రవి పాల్గొన్నారు.

జైనూర్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్మికులు జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనక యాదవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా కల్పించారు.కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు మడావి కొద్దు, కుమ్రం కుంజేరావు, మెస్రం చిన్ను, మోతిరాం, యశ్వంత్‌రావు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నవతెలంగాణ-బెజ్జూర్

అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని కుంటలమానేపెల్లి, సలుగుపెల్లి, బెజ్జూర్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలకు భూమిపూజ చేశారు. మండలకేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.25 లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సలుగుపెల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే కోనప్ప ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పోడు భూములకు పట్టాలిచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటు, ఎరువులు తదితర పథకాలను ప్రవేశపెట్టిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మోసగాళ్ల చెప్పే మాటలను ప్రజలు నమ్మద్దని సూచించారు. సలుగుపెల్లి గ్రామంలో గిరిజనేతరుల పట్టాల విషయమే రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. మహారాష్ట్ర ప్రజలు తెలంగాణ పాలన, కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని తెలిపారు. అన్ని వర్గాలకు మేలు చేసే ప్రభుత్వమన్నారు. మండలంలోని మర్తిడి, సలుగుపెల్లి తదితర అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. దళితుల ఆర్థికాభివృద్ధికి దళితబంధు, బీసీల సంక్షేమం కోసం రూ.లక్ష ఆర్థిక సాయం, గిరిజనులకు పోడు భూముల పట్టాలు అందజేస్తున్నట్టు తెలిపారు. మద్దిగూడెం గ్రామంలో సైడ్రేన్, ఇండ్లు త్వరలో మంజూరు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సలుగుపెల్లి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే కోనప్ప సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, రైతుబంధు జిల్లా కోఆర్డినేటర్ జగ్గాగౌడ్, ఎంపీటీసీలు లక్ష్మి, పర్వీన్ సుల్తానా, మండల కోఆప్షన్ సభ్యుడు బశరత్‌ఖాన్, సర్పంచ్‌లు హనుమంతు, బుజాడి శేఖర్, బీఆర్ఎస్ అధ్యక్షుడు సకారాం, యూత్ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, నాయకులు వెంకన్న, సతీష్, మహేష్, జావిద్ అలీ, శంకర్, పురుషోత్తం, రాజారాం పాల్గొన్నారు.

కౌటాల : బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే మారుమూల పల్లెలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన నాగపెల్లి గ్రామంలో పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సీఎం కేసీఆర్ హయాంలోనే పల్లెలు అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తండాలను, గూడాలను పంచాయతీలుగా ఏర్పాటుచేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, ఎంఈఓ మౌనిక, సర్పంచ్‌లు వసాకె నిహారిక, ఒజ్జెల మౌనీష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వసంత్‌రావు, బీఆర్ఎస్ నాయకులు సంతోష్, మధూకర్, జ్యోతిరావు, బిట్టు, నాందేవ్ పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వం బీసీ గణన చేపట్టాలి



నవతెలంగాణ-నస్పూర్

కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీ గణన చేపట్టాలని బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం 16వ తేదీన మంచిర్యాల ఐబీ చౌరస్తాలో బీసీ ఐకే వేదిక ఆధ్వర్యంలో నిరసన దీక్షను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ దీక్షకు మంచిర్యాల జిల్లా బీసీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. చట్టసభలలో బీసీలకు 50 శాతం కల్పించాలని అన్నారు. జనగణన పట్టికలో 34 కాలమ్స్ ఉన్నాయని, కులగణన చేస్తే అదనంగా ఇంకొక కాలం మాత్రమే చేరుతుందని, దీనికి రూపాయి కూడా ఖర్చు కాదు ఒక కాలం పెట్టడానికి అంగీకరించని కేంద్ర ప్రభుత్వం దేశంలోని 85 కోట్ల మంది బీసీలను ఎలా అభివృద్ధి చేస్తుందన్నారు. జనగణనలో కులగణన భాగం చేస్తే బీసీలకు విద్యా ఉద్యోగాలతో స్థానిక సంస్థలలో ప్రస్తుతం కొనసాగుతున్న రిజర్వేషన్లను పెంచాల్సి వస్తుందని, పాలకులు భావిస్తున్నారని, అలాగే కొత్తగా చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్ పెట్టాలని డిమాండ్ ముందుకు వస్తుందని భయంతో కేంద్ర ప్రభుత్వం బీసీ గణనకు వెనుకాడుతుందని తెలిపారు. బీసీలకు ఇవ్వవలసిన ప్రజాస్వామ్య వాటా ఇవ్వకుండా ఎన్ని రోజులు దాటవేస్తారు స్వతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటిన 60 శాతం జనాభా కలిగిన బీసీలకు రిజర్వేషన్ల కేటాయింపులో అన్యాయం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. బీసీలకు ఆగ్రహానికి గురికాకముందే బీసీ గణన చేపట్టాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే దేశంలో గుర్తింపు పొందిన 27 రాజకీయ పార్టీలు బీసి గణనకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వానికి లేఖలు ఇవ్వడం జరిగిందని, అలాగే తొమ్మిది రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ గణన మీద అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపడం జరిగిందని, ఇప్పటికైనా బీసీల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా బీసీ ఐక్యవేదిక కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, బీసీ సీనియర్ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, రంగు రాజేష్, గొల్ల కుర్మ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న యాదవ్, కురుమ సంఘం జిల్లా నాయకులు సమ్ము రాజయ్య, గరిగే స్వామి, గంగపుత్ర సంఘం నాయకులు పాక వెంకటేశ్వర్లు, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు చిలుముల అంజన్న, యాదవ సంఘం నాయకులు జక్కుల కుమార్ పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని ఐనం గ్రామానికి చెందిన మహిళ చందన్‌కడె సౌజన్య(23) కడుపునొప్పి భరించలేక పెద్దవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సౌజన్య గత వారం రోజుల క్రితం కాగజ్‌నగర్ మండలం అందవెల్లిలో నివాసముంటున్న తన పెద్దమ్మ నౌగడె సుశీల ఇంటికి వెళ్లింది. కడుపునొప్పి భరించలేక బుధవారం అందవెల్లి సమీపంలోని పెద్దవాగులో దూకగా గురువారం రాత్రి దహెగాం మండలం ఇట్యాల పెద్దవాగులో మృతదేహం లభ్యమైనట్టు పేర్కొన్నారు. భర్త సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

దుర్గామాత ఆలయంలో ఘనంగా సామూహిక హోమం

జన్నారం : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో నూతన దుర్గాదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా శుక్రవారం రెబ్బెన మండలంలోని అచలాపూర్ వేద పాఠశాల పండితుల చేత సామూహిక హోమాలు నిర్వహించారు. ఈ సామూహిక హోమాలలో జన్నారం సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్ దంపతులు మరో 50 జంటలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శనివారం తెల్లవారుజామున దుర్గామాత విగ్రహ ప్రతిష్ట ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత ఆలయ కమిటీ సభ్యులు జాడి రాజన్న, జాడి వెంకట్, లచ్చన్న, పోచన్న, చంద్రయ్య, రవి, శంకర్, కుకటికారి రాజలింగు, మల్లేష్ పెరుగు తిరుపతి పాల్గొన్నారు.

17న నిరసన దీక్షను విజయవంతం చేయండి : టీఎస్‌యూటీఎఫ్



నవతెలంగాణ-సిర్పూర్(టి)

గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు పార్ట్ టైం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెట్ చేయాలని డిమాండ్‌తో ఈ నెల 17న చేపట్టబోయే నిరసన దీక్షను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిరసన దీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 17వ తేదీన ఆసిఫాబాద్‌లో నిర్వహించే నిరసన దీక్షకు జిల్లాలోని వివిధ యాజమాన్యాల గురుకుల ఉపాధ్యాయులు పాల్గొనాలన్నారు. గురుకుల పాఠశాలలు ప్రారంభించి ఏండ్లు గడుస్తున్నప్పటికీ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. 30 గురుకుల పాఠశాలలో గెస్ట్ పార్ట్ టైం, అవుట్‌సోర్సింగ్ అనే పేర్లతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆ పేర్లను తొలగించాలని బేసిక్ పే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉపాధ్యాయులకు పని భారం అధికంగా ఉన్నందున స్కేల్ మంజూరు చేయాలని గురుకుల సిబ్బందికి హెల్త్ కార్డులను మంజూరు చేయాలని, ప్రత్యేకంగా వార్డెన్‌లలో కెర్‌టేకర్లను నియమించాలని గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు పోటీ పరీక్షల్లో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్ మండల బాధ్యులు సంతోష్ గౌడ్, సంగీత, దీప్తి పాల్గొన్నారు.

ఇందిరమ్మ క్విజ్ పోటీల పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ నియోజకవర్గంలో ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ఇందిరమ్మ క్విజ్ పోటీలు' పోస్టర్ ని సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గం విద్యార్థిని విద్యార్థులకి ఇదొక చక్కని అవకాశమని, ఈ క్విజ్ పోటిల్లో అందరూ పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని అన్నారు. వినోద్ నాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ క్విజ్ పోటీలు మండలాల వారీగా నిర్వహించడం జరుగుతుందని, పోటీలు పరీక్ష పద్దతిలో ఉంటాయి అని, గెలుపొందిన వారికి రూ.2 లక్షల వరకు నగదు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు. పోటీలు పాఠశాల, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పోటిల్లో జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. ఆసక్తిగల వారు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 9550225672 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బాల కార్మిక నిర్మూలనకు కట్టుబడి ఉండాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్
- ఆపరేషన్ ముస్కాన్‌పై సమీక్ష సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో బాల కార్మిక నిర్మూలనకు అన్ని శాఖలు ప్రయత్నించాలని దీనికోసం చేపట్టే ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. శుక్రవారం ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమ నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాలు, హోటళ్లు, పరిశ్రమలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి వారిని బాలసదనంలో చేర్పించాలని, 14 సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయిస్తున్న యజమానులపై కేసులు నమోదు చేయాలని తెలిపారు. ఇటుకలు తయారీ, స్టోన్ కంపెనీలు, క్రషర్ కంపెనీలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి వారిని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో చేర్పించి విద్యను అందించాలని, ఆ దిశగా బాలల రక్షణ కమిటీ సభ్యులు కృషి చేయాలని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. బడికి దూరంగా ఉన్న పిల్లలు, మధ్యలో బడి మానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ సావిత్రి, డీసీపీఓ మహేష్, డీఎస్పీ శ్రీనివాస్, డీఐఈఓ శ్రీధర్ సుమన్, ఇన్‌ఛార్జి జిల్లా విద్యాధికారి ఉదయబాబు పాల్గొన్నారు.

ఎస్ఆర్పీ-1 గని ఉద్యోగికి అభినందన

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ-1 గని మ్యాన్ రైడింగ్ మెయింటెనెన్స్ ఫిట్టర్ ఎనగందుల వెంకటనారాయణను డీఎంఎస్(మెకానికల్) ఇన్స్‌పెక్టర్ అరుముగమ్ శుక్రవారం అభినందించారు. గనిని తనిఖీ చేస్తూ, గనిలో మ్యాన్ రైడింగ్ సిస్టం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనిలో మ్యాన్ రైడింగ్ సిస్టమ్ భద్రత, పనితీరు బాగుందని అన్నారు. దీనికి కారణమైన ఫిట్టర్ అభినందించి, రూ.1000 అందజేసినట్లు తెలిపారు. డీఎంఎస్ తన సర్వీసులో ఇప్పటివరకు చూసిన సృజనాత్మకత గల ఉత్తమ ఉద్యోగులలో ఎనగందుల వెంకట నారాయణ నాల్గవ వ్యక్తి అని అభివర్ణించినారు. ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓ టూ జీఎం రఘు కుమార్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్‌రావు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాంపూర్ గ్రూప్ మైన్స్ ఏజెంట్ గోపాల్‌సింగ్, గని మేనేజర్ విజయ్ కుమార్, శ్రీరాంపూర్ గ్రూప్ ఇంజనీర్ సాంబశివరావు, గని సేఫ్టీ ఆఫీసర్ రాజేష్‌బాబు, పిట్ ఇంజనీర్ శంకరయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
www.navatelangana.com
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 15 జులై 2023

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. వాంకిడి మండలంలోని కమాన, ఆసిఫాబాద్ మండలంలోని బూరుగూడ గ్రామానికి చెందిన లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి సీఎం సహాయనిధి నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, సర్పంచ్ గోపాల్, ఉపసర్పంచ్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, లబ్దిదారులు పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్లకు ఉద్యోగోన్నతుల పరీక్షలు

రెబ్బెన : ఖైరిగూడ ఓసీ వద్ద బెల్లంపల్లి రీజియన్ పరిధిలో ఈపీ ఆపరేటర్ల ఉద్యోగోన్నతుల కోసం పరీక్షలు నిర్వహించారు. సీ గ్రేడ్ నుండి బి గ్రేడ్ పదోన్నతి కోసం 36 మంది పరీక్షలకు హాజరయ్యారు. కార్పొరేట్ డీజీఎం(పీఈఆర్) కె అజయ్‌కుమార్ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. మెరిట్ లిస్టును వెంటనే ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఉమాకాంత్, ఈఓ ఎల్ సత్యనారాయణ, ఫిట్ ఇంజనీర్ రాజాజీ, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, డీవైపీఎం నాగుల వేణు, టీబీజీకేయస్ నాయకులు మారిన వెంకటేశం పాల్గొన్నారు.



సొనాలలో కార్యాలయాలు ఏర్పాటు చేయాలని వినతి



నవతెలంగాణ-బోథ్

నూతన మండలంగా ఏర్పాటైన సొనాలలో కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ శుక్రవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కోరారు. కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మండలం ఏర్పాటుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపి మండల గజిట్‌ను త్వరగా విడుదల చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ త్వరలోనే మండలంలో అధికారులు పనులు ప్రారంభించేలా ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

పీఓను కలిసిన బీజేపీ నాయకులు



నవతెలంగాణ-ఉట్నూర్

సమస్యలను పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్ పాయ్‌ను శుక్రవారం ఐటీడీఏ పీఓ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, సుహాసినిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన వసతి గృహాల్లో, పాఠశాలల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని పేర్కొన్నారు. అదే విధంగా రిమ్స్‌లో గిరిజనుల కోసం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక విభాగం కేటాయించి, అంబులెన్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. పీఓను కలిసిన వారిలో బీజేపీ జాతీయ నాయకులు శ్రీరామ్ నాయక్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేశ్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు మరప రాజు, నాయకులు శివకుమార్, క్రాంతి కుమార్, శ్రీకాంత్, రాజలింగు ఉన్నారు.

16న జిల్లాస్థాయి ఈత పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈనెల 16న ఇందిరా ప్రియదర్శిని మైదానంలోని స్విమ్మింగ్ పూల్‌లో జిల్లాస్థాయి ఈత పోటీలను నిర్వహించనున్నట్లు స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలబాలికల సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారు ఈనెల 23, 24 వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని ఒడిశాలో ఆగష్టు నెలలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని వివరించారు. గ్రూప్ వన్‌లో 15, 16, 17 సంవత్సరాల బాలబాలికలు, గ్రూప్ టూలో 12, 13, 14, గ్రూప్ త్రీలో 10, 11 సంవత్సరాల బాలబాలికలు ఉంటారని తెలిపారు. ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లై, ఇండివిడ్యువల్ మెడ్లీ విభాగాల్లో పోటీలు జరగనున్నాయని వివరించారు. ఆసక్తి కలిగిన వారు స్థానిక స్విమ్మింగ్ పూల్‌లో తమ వివరాలను నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

కారు ఢీకొని సైకిలిస్టు మృతి

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని రెబ్బనపల్లి గ్రామానికి చెందిన గాలివల్లి గురువయ్య(60) అనే వ్యక్తి సైకిల్‌పై వెళ్తుండగా కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు దండేపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపారు ప్రకారం.. మృతుడు గురువయ్య వ్యక్తిగత పనుల నిమిత్తం సమీప గ్రామం ముత్యంపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా ముత్యంపేట బస్టాండ్ వద్ద అతివేగంగా వచ్చి కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నిర్లక్ష్యంగా నడిపి గురువయ్య మృతికి కారణమైన డ్రైవర్‌పై పరిచర్యలు తీసుకోవాలని మృతుని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. మృతుని భార్య గౌరక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ముగిసిన పద్మశాలీ సంఘం నామినేషన్ల ప్రక్రియ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశాలీ సేవా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శుల ఎన్నికలకు శుక్రవారం నామినేషన్ల పర్వం ముగిసింది. నలుగురు అభ్యర్థులు ప్రధాన కార్యదర్శి, ఇతరులు అధక్యక్ష పదవికి నామినేషన్ వేసినట్లు ఎన్నికల పరిశీలకులు శ్రీకాంత్, శైలేందర్, వెంకన్న, తిరుపతి తెలిపారు. శనివారం నామినేషన్ల తిరస్కరణ, 17న అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. 23న ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. అధ్యక్షుడు పదవికి ఇరుకుల్ల అంజనేయులు(ఆసిఫాబాద్), మారిన వెంకటేశ్వర్లు (గోలేటి), ప్రధాన కార్యదర్శికి తేలివార్ మోహన్‌కుమార్(ఆసిఫాబాద్), వనమాల మురళీకృష్ణ ప్రసాద్(రెబ్బెన), గడుదాసు మల్లయ్య(కాగజ్‌నగర్), మాచర్ల శ్రీనివాస్ (కాగజ్‌నగర్) నామినేషన్ వేశారని ఎన్నికల పరిశీలకులు వెల్లడించారు.

భిక్షాటనతో పారిశుధ్య కార్మికుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు తొమ్మిది రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా శుక్రవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్య పరిష్కారం కోసం చర్య తీసుకోవాలని భిక్షాటన చేస్తున్నట్లు వివరించారు. కనీస వేతనాలు అమలు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, మరణించిన గ్రామపంచాయతీ కార్మికుడికి రూ.10లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. మరణించిన కార్మికుని కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, కేటగిరి వైజ్‌గా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీటీయు జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, గ్రామపంచాయతీ కార్మికులు రాజు, సమ్మయ్య, శంకర్, మహేష్, సాబీర్, నగేష్, విలాస్, కైలాస్, యమునబాయి, పద్మ పాల్గొన్నారు.

కాసిపేట : కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి, పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం కృషి చేసిన పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బిఎస్పి నియోజకవర్గ ఇన్‌చార్జి వరప్రసాద్, నియోజకవర్గ అధ్యక్షులు దాసరవు రాజు అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో తమ డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్న కార్మికులకు బిఎస్పి తరపున మద్దతు పలికారు.

రెబ్బెన : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను అమలు చేయకుండా శ్రమదోపిడీ గురి చేస్తోందన్నారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగవెల్లి సుధాకర్, దుర్గం వెంకటేశ్, రాచకొండ రమేష్, శంకర్, శ్రీనివాస్, బాబాజీ, సత్యనారాయణ, దేవాజీ, లక్ష్మి పాల్గొన్నారు.



కాసిపేట



రెబ్బెన

జాతీయ జెండా నిర్మాణ పనులు పరిశీలన

- త్వరలో ఐటీ టవర్ నిర్మాణం ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుపుతున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద ఏర్పాటు చేస్తున్న భారీ జాతీయ జెండా నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఎన్డీటీ డేటా కంపెనీ సీఎస్ఆర్ నిధులతో 150 అడుగుల ఎత్తైన భారీ జాతీయ జెండాను ఏర్పాటు చేయనుండగా అందుకు సంబంధించిన పనులను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ భారీ జాతీయ జెండా నిర్మాణ పనులు అతి త్వరలోనే పూర్తి చేసుకుని ఎమ్మెల్యే జోగు రామన్న చేతుల మీదుగా ప్రారంభించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే సూచనల మేరకు జాతీయ జెండా ఏర్పాటుకు ముందుకు వచ్చిన కంపెనీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. జాతీయ భావం ఉట్టిపడేలా భారీ త్రివర్ణ పతాకాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఐటీ సేవలను విస్తరించడంతో అనేక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభించిందని, త్వరలోనే రూ.40కోట్ల వ్యయంతో ఐటీ టవర్ నిర్మాణం సైతం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగిలి ప్రశాంత్, వాగ్మారే ప్రశాంత్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలకు భవనాలు మంజూరు చేయాలి



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ డివిజన్ కేంద్రంలో బీసీ(ఎస్ఎంఎస్) పోస్ట్ మెట్రిక్ బాయ్స్ అండ్ గర్ల్స్ హాస్టళ్లకు సొంత భవనాలు మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడే భీమేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిసి వినతిపత్రం అందజేశారు. హాస్టళ్లు మంజూరై 12 సంవత్సరాలు గడుస్తున్నా అద్దె భవనాలలోనే కొనసాగుతున్న పరిస్థితి ఉందన్నారు. సరిపడా గదులు లేక వంట కూడా అదే రూముల్లో చేస్తున్నారని, ఏ హాస్టల్‌కు సైతం క్రీడా మైదానం లేదని పేర్కొన్నారు. వర్షం పడితే ఉరుస్తున్నాయని, విద్యార్థులు నిద్రలేని రాత్రులు ఎన్నో గడుపుతున్నారన్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఎస్సీ ఎస్టీ మేనేజ్మెంట్ హాస్టల్స్ మంజూరు చేయాలని, బీసీ మేనేజ్మెంట్ హాస్టళ్లకు సొంత భవనాలు మంజూరు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి సాయికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ సాయికృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు నితీష్, నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలి



ఇంద్రవెల్లి : మోడల్ జీపీగా ఎంపికైన ముత్నూర్ పంచాయతీలో చేపడుతున్న పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని ట్రైనీ కలెక్టర్ శ్రీజ అన్నారు. శుక్రవారం ఆమె వివిధ శాఖల అధికారులతో జీపిని సందర్శించారు. రోడ్డు కిరువైపుల బురద లేకుండా మొరం వేయాలన్నారు. మురికి కాలువలు శుభ్రపర్చాలని, తాగు నీటి పథకాలను ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. బోర్‌వెల్ వద్ద ఇంకుడుగుంతలను నిర్మించాలన్నారు. ఇంటింటికీ మరుగుదొడ్లు ఉండేటట్లు చూడాలని పేర్కొన్నారు. పంచాయతీలోని వివిధ వార్డుల్లో చెత్తాచెదారాన్ని ప్రతిరోజూ సేకరించాలని ఆదేశించారు. హరితహారంలో పెట్టిన మొక్కలను సంరక్షించాలన్నారు. స్వచ్ఛభారత్ కింద ఎంపికైన జీపికి వచ్చేనెలలో కేంద్ర తనిఖీ బృందం రానుండటంతో చేపట్టిన పనులు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఆమె వెంట సర్పంచ్ బాగుబాయి, జడ్పీ సీఈవో గణపతి, డిప్యూటీ సిఈఓ రాథోడ్ రాజేశ్వర్, ఇన్‌చార్జి డీఆర్‌డీఓ .రాథోడ్ రవీందర్, డిపిఓ శ్రీనివాస్, ఈసి జాదవ్ శ్రీనివాస్ ఉన్నారు.

జలపాతంలో యువతి ఆత్మహత్యాయత్నం

నేరడిగొండ : మండలంలోని కుంటాల జలపాతంలో హైదరాబాద్ మధురనగర్ చెందిన యువతి కట్ట మైథిలి శుక్రవారం మతిస్థిమితం లేక ఆత్మహత్యకు యత్నించింది. యువతి తల్లిదండ్రులు మధురనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అక్కడి పోలీసులు నేరడిగొండ పోలీసులకు తెలియజేశారు. ఇచ్చోడ సిఐ ఆదేశాల మేరకు పోలీసులు కుంటాల సర్పంచ్ అశోక్ సహకారంతో జలపాతం పరిసరాల్లో వెతికారు. యువతి కనిపించడంతో ఎస్సై సాయన్నకు తెలిపారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని యువతిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి తండ్రి ఎల్లారెడ్డికి అప్పజెప్పినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

గొర్రెల యూనిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ - హాజీపూర్

మండలంలోని దొనబండలో రెండో విడత 8 గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. 20 గొర్రెలు ఒక్క పొట్టేలు ఒక్కో యూనిట్ ను శుక్రవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గొల్ల, కురుమలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టారన్నారు. సబ్సిడీ గొర్రెలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గొర్రెలతో గొల్ల, కురుమలు ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ సరిత, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి రవి, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, సర్పంచ్ జాడి సత్యం, జెడ్పీ కో ఆప్షన్ నాయింపాషా, గొర్రెల సొసైటీ మండల అధ్యక్షులు గెల్లు మల్లేష్, నాయకులు అల్లముల నాగయ్య, అలిశెట్టి కోటి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-నస్పూర్

సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణమూర్తి, అనురాధ, కల్పన, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

17న నిరసన దీక్షను విజయవంతం చేయాలి



నవతెలంగాణ - రెబ్బెన

గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న ఆసిఫాబాద్‌లో జరిగే నిరసన దీక్షను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు హనుమంతరావు అన్నారు. శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ యాజమాన్యాల గురుకుల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గురుకుల పాఠశాలలు ప్రారంభించి ఏండ్లు గడుస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గురుకుల పాఠశాలలో గెస్ట్, పార్ట్‌టైం, అవుట్‌సోర్సింగ్ పేర్లతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆ పేర్లను తొలగించాలన్నారు. నిరసన దీక్షకు ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 5న హైదరాబాద్‌లో మహాధర్నాకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మహేందర్, ప్రిన్సిపాల్ జ్యోతి, సృజన పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, కారోబారి, బిల్‌కలెక్టర్లను పంచాయతీ సహాయ కార్యదర్శులుగా నియమించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్, నాయకులు ఉన్నారు.

సెక్యూరిటీ సిబ్బంది నియామకంలో నిర్లక్ష్యం ఎందుకు..?



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది నియామకంలో నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరిస్తునారో అర్థం కావటంలేదని సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శుక్రవారం మందమర్రి ఏరియాలో అర్గనైజర్ మహమ్మద్ ఆరిఫ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్‌లు సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా గత 11 ఏండ్లుగా సిబ్బంది తగ్గుతున్నా రిక్రూట్మెంట్ చేయకుండా యాజమాన్యం భద్రత వ్యవస్థ ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తుందని విమర్శించారు. ప్రతీ గనిలో ఐఈడి ప్రకారం అని లెక్కలు చెప్పే యాజమాన్యం సెక్యూరిటీ సిబ్బంది విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తుందో చెప్పాలన్నారు. సంస్థ ఆస్తులను రక్షించాలని చెప్పే యాజమాన్యం సిబ్బంది తగ్గుతుంటే అదెలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. మరోవైపు చెక్ పోస్టులలో కనీస సౌకర్యాలు కల్పించడంలో కూడా నిర్లక్ష్యం వహిస్తుందని, కంప్యూటర్లపై పని చేయించుకుంటూ సరిపడా స్టేషనరీ ఇవ్వడం లేదని, కంప్యూటర్లు చెడిపోయినా మార్చడం లేదని ఎలాంటి అలవెన్స్‌లు లేకుండా కంప్యూటర్స్‌పై పని చేయించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమం లో బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ వెంకటస్వామి, అల్లి రాజేందర్, సీనియర్ నాయకులు అలవాల సంజీవ్, ఆర్గనైజర్లు జోరుక వెంకటేష్, భేతి భరత్, శ్రీనివాస్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని పులిమడుగు, సాకెర(బి), జైత్రాం తండ గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే అజ్మీరా రేఖ నాయక్ పర్యటించారు. ఎమ్మెల్యే రాకతో ఆయా గ్రామాల ప్రజలు స్వాగతం పలికారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. సమస్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ అధికారులతో మాట్లాడి అన్ని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామంలో కావాల్సిన చిన్న చిన్న మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం యెందా గ్రామానికి చెందిన ముకుంద్ సోదరుడు అనారోగ్యానికి గురై ఇంటి వద్ద ఉండగా విషయం తెలిసి పరామర్శించారు. అనారోగ్యంపై ఆరా తీశారు. సమస్యలేమి ఉన్న నా దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యే పార్టీ నాయకులు ఉన్నారు.

నిరసన దీక్ష విజయవంతం చేయాలి

నవతెలంగాణ-దండేపల్లి

గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కొట్టే చంద్రమౌళి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై పని భారం తగ్గించే విధంగా చూడాలని పేర్కొన్నారు. సమాన పనికి సమానం వేతనం చెల్లించాలని గురుకులాల్లో బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని కోరారు. అన్ని సొసైటీలో ఏకరూప పరిపాలన అమలు చేయాలని బోధన సమయాన్ని ఇతర సొసైటీలో మాదిరిగా మార్చాలన్నారు.

పేద విద్యార్థులకు అబ్దుల్లా ఆర్థిక సాయం

నవతెలంగాణ-తలమడుగు



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు బస్ పాసుల కోసం దేవాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ నాయకులు అబ్దుల్లా రూ.5వేల ఆర్థిక సాయం శుక్రవారం వికాలాంగత్వం ఉన్నా విద్యార్థులకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులు సాయం చేయాలనే ఉద్యేశంతో సాయం చేసినట్లు అబ్దుల్లా తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వక్అలీ, మోహన్, నవీన్, అశోక్, సంతోష్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెకు ఎమ్మార్పీఎస్ మద్దతు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పంచాయతీ పారిశుధ్య కార్మికులు గత తొమ్మిది రోజులుగా శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మెకు ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్ మాదిగ శుక్రవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పట్టించుకోలేని చేతకాని ప్రభుత్వమని అన్నారు. సమ్మెను విచ్చిన్నం చేసే కుట్రలు రాష్ట్ర ప్రభుత్వం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో రోడ్డ రాజశేఖర్, తరుడి ప్రవీణ్ కార్మికుల మండల బాధ్యులు గంగన్న, బి.గంగన్న, బొజ్జ నరేష్, సుంకం రాజేశ్వర్, వినోద్, పోచన్న, అక్బర్ ఖాన్, విలాస్, రాజు, కార్మికులు పాల్గొన్నారు.

పంటల వివరాలను నమోదుచేసుకోవాలి

నవతెలంగాణ-దహెగాం

రైతులు తాము పండించే పంటల సాగు వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని ఐనం, బీబ్రా గ్రామాల్లో పర్యటించి పంటల నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించే పంటలను నమోదు చేసుకుంటేనే పంటలు అమ్ముకొనేటప్పుడు వీలుంటుందన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సాగు వివరాలను నమోదుచేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ వెన్నెల ఉన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలి

నవతెలంగాణ-బోథ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ నాయకుడు నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆటో యూనియన్ సభ్యులతో అయినా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆటోతో పాటు ఇతర వాహనాలకు రాయితీ కల్పిస్తూ, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని పర్యటించారు. అలాగే ప్రభుత్వం చేపట్టే ప్రతి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు పాల్గొని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అడెల్లిలో సానిటేషన్ డ్రైవ్

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని అడెల్లి గ్రామంలో సానిటేషన్ డ్రైవ్ శుక్రవారం సెక్రటరీ ప్రేమలత ప్రారంభించారు. పారిశుధ్య పనులు చేపట్టి, ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి ప్రేమలత గడప గడపకు వెళ్లి ఇంటి వద్దగల డ్రమ్ముల్లో, పూలకుండిల్లోని నీటిని తిసివేయించి, సానిటేషన్ డ్రైవ్‌పై అవగాహన కల్పించారు. వానకాలంలో ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌డీ టీచర్ భాగ్యలక్ష్మి, హరీష్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తెగిపోయిన చెక్ డ్యామ్‌ల పరిశీలన

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



గతంలో అటవీ ప్రాంతంలో తెగిపోయిన చెక్‌డ్యామ్‌లను శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేంధర్, ఎఫ్ఆర్ఓ వినాయక్ కలిసి పరిశీలించారు. పట్టణానికి సమీపంలో ఉన్న చెక్ డ్యామ్‌లు గతేడాది భారీ వర్షాలకు తెగిపోయాయి. చెక్ డ్యామ్‌ల నుంచి వచ్చిన వరదకు రాజీవ్ నగర్, విద్యానగర్ ప్రాంతాలు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సదరు చెక్ డ్యామ్‌ల మరమ్మతుల విషయాన్ని రెండు రోజుల కింద ఖానాపూర్ వచ్చిన జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి దృష్టి కి తీసుకెళ్లారు. వర్షాకాలం దృష్ట్యా పట్టణంలోని అటవీ ప్రాంతం నుంచి వరద ముప్పు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు తెగిపోయిన కుంటలు, చెక్ డ్యామ్‌లను పరిశీలించారు. తెగిపోయిన వాటికి మరమ్మతులతో పాటు కొత్తగా నిర్మించనున్న చెక్ డ్యామ్‌ల కోసం స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ వినాయక్, తహసీల్దార్ రాజమోహన్, మున్సిపల్ కమీషనర్ మనోహర్, ఎంపీడీఓ మల్లేశం, అటవీ సిబ్బంది ఉన్నారు.

చదువే అన్నింటికి మూలాధారం



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చదువే మూలాధారమని వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని దేగామ ప్రాథమిక పాఠశాలలో గదుల మరమ్మతులు ప్రహరీ గోడ ప్రారంభ కార్యక్రమానికి హజరయ్యారు. గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాల విద్యార్థులకు గదులలో ఫ్లోరింగ్ చెడిపోయి ప్రహరీ గోడ లేక అటు చదువుకు ఇటు ఆటలకు ఆటంకంతో విద్యార్థులు విద్య అభ్యస్తున్నారని అన్నారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ సర్వసభ్య సమావేశాల్లో తమ పాఠశాల పరిస్థితిని తెల్పడంతో ఈ విద్యా సంవత్సరం రూ.6.60 లక్షల వ్యయంతో పాఠశాల ప్రహరీ గోడ, తరగతి గదులను మరమ్మతులు పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ రాధా రాథోడ్, విచ్చేసి పాఠశాలను ఇంతకుముందు సందర్శించినప్పుడు విద్యార్థులకు తరగతి గదులు చాలా అసౌకర్యంగా ఉండేదని ప్రస్తుతం పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చి పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రతి ఒక బడి ఈడు పిల్లలను స్కూల్లో చేర్పించి విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. పాఠశాలను మరమ్మతు చేయించినందుకు గ్రామస్తులు ప్రజాప్రతినిధులను, అధికారులను శాలువాతో సన్మానించి, హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో హరితహారంలో భాగంగా మునగ మొక్కలను నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దుర్వ లక్ష్మణ్, పాఠశాల చైర్మెన్ సుదర్శన్, నోడల్ ఆఫీసర్ కిషన్ గుప్త, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్, ఉపాధ్యాయురాలు మీనాక్షి, హైస్కూల్ ఉపాధ్యాయులు భూమన్న, సర్పంచ్‌గూడ పాఠశాల ఉపాధ్యాయులు రాజ్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ మాదవ్‌రావ్, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

17న గురుకుల ఉపాధ్యాయుల ధర్నా : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 17న సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించబోయే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్‌లు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పలు గురుకుల పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయులను ఉద్దేశించి వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గురుకుల పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వానికి పలుమార్లు ప్రాతినిధ్యం చేసినా సమస్యల పరిష్కారం పట్ల ఏమాత్రం చొరవ చూపలేదని అన్నారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం జూలై 17న నిర్వహించే జిల్లా స్థాయి ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని అన్నారు.

కేసీఆర్ నియంతృత్వ పాలనకు స్వస్తి చెప్పాలి

నవతెలంగాణ-కుభీర్

కేసీఆర్ నియంతృత్వ పాలనకు ప్రజలు స్వస్తి చెప్పాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ముధోల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు మోహన్ రావు పటేల్ అన్నారు. శుక్రవారం పల్లె పల్లెకు బీజేపీ, గడప గడపకు మోహన్‌రావు పటేల్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బ్రహ్మేశ్వర్ గ్రామ పంచాయతీ, చోక్లా నాయక్ తండా, నంద్‌పాడ్ సేవాదాస్ నగర్, గాలసింగ్ తండా, మర్లగొండ, గ్రామ పంచాయతీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ముందుగా బ్రహ్మేశ్వర్ గ్రామ పంచాయతీలో ఉన్న పురాతన శివాలయంలో మోహన్‌రావు పటేల్ ప్రత్యేకపూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో పాటు పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం గ్రామంలో ఎర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని, ప్రజా సమస్యలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి పెడిపెల్లి గంగాధర్, మాజీ ఎంపీపీ రాథోడ్ యోగిత కమలేష్, బూత్ అధ్యక్షుడు జాదవ్ అజయ్, కార్యదర్శి రాథోడ్ దేవిదాస్, గోపాల్‌రావు పటేల్ మండల బీజేపీ నాయకులు శివలింగం, అనిల్, గజేందర్, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం

నవతెలంగాణ-బోథ్

పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు బీజేపీ నాయకులు మద్దతుగా సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సుభాష్, సూర్య, కిషన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడుగు అశోక్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శి లాడేవార్ తుకారాం, పట్టణ అధ్యక్షులు రవితేజ, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ బోరే రవీందర్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బారె భోజన్న, ఓబీసీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సోలంకి శ్రీకాంత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

బీఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ భీంసరి గ్రామంలో శుక్రవారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న దిష్టి బొమ్మలను గ్రామంలో ఊరేగించి దహనం చేయడం జరిగిందని డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ సంజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా సినీనిర్మాత రవికిరణ్ యాదవ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సినినిర్మాత, ప్రముఖ హోమియోపతి వైద్యుడు రవి కిరణ్ యాదవ్ జన్మదిన వేడుకలను యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు పాల్గొని, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రవికిరణ్ యాదవ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు రఘువీర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి హనుమాండ్లు యాదవ్ ఉన్నారు.

అంకోలి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అంకోలి పీహెచ్‌సీని శుక్రవారం ఎజెన్సీ డీఎంహెచ్ఓ డాక్టర్ కుంరం బాలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని అన్ని విభాగాలను పరిశీలించారు. డెలివరీ రూమ్, మందుల విభాగం, ఆపరేషన్ థియేటర్, ఆయుష్ విభాగం, నర్సరీ, రికార్డులను పరిశీలించారు. రోజు వారి ఓపి ఎలా ఉందో స్టాఫ్ నర్స్ గంగామణిని ఆడిగి తెలుసుకున్నారు. అటెండెన్స్ రిజిస్టర్ చూసి గైర్హాజర్ అయిన వారి వివరాలు అడిగి తెలిసుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగామణి, ద్రుపతి, సురేష్, మౌనిక, అదనపు డీఎంహెచ్ఓ సబ్ యూనిట్ అధికారి తులసీదాసు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పాలి

నవతెలంగణ-ముధోల్

వర్షాకాలం దృష్ట్యా ఎలాంటి వ్యాధుల ప్రబలకుండా జాగ్రత్తలు పాటించి గ్రామాలలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పాటు చేసుకుందమని మండల ప్రత్యేకాధికారి సుదర్శన్ అన్నారు. మండల కేంద్రంలో పలు వార్డుల్లో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. టైర్లలో, గుంతలలో, దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ తదితర వాటిని వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అమీర్ ఖాన్, పంచాయతి కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎన్ఈపీ, సీపీఎస్ రద్దు చేయాలి

నవతెలంగాణ-బేల

ఎన్ఈపీ, సీపీఎస్ రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బేల మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో విద్యావ్యవస్థ రోజు రోజుకు దిగజారుతోందని అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో తెలంగాణ 34వ స్థానానికి చేరిందంటే ఎంత నష్టం జరిగిందో తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివన్న, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయకర్, ప్రేమ్‌సింగ్, నరేష్ కుమార్, విటోబా, లక్ష్మణ్, పోచ్చిరామ్ పాల్గొన్నారు.